# ఆస్తి

"అరవింద్ ఎంత మంచివాడో నేను చెప్పలేను, మామయ్యా! మనిషి హుందాగా, స్మార్ట్‌గా, హాండ్‌సంగా ఉంటాడు. చక్కటి ఉద్యోగం, మృదుస్వభావం, నాకే మాత్రం కష్టం కలిగినా అతను సహించలేడు. అలాంటి మనిషిని నేనెక్కడా చూడలేదు. మేం పెళ్ళి చేసుకోవాలనే నిర్ణయానికొచ్చాం. రేపు సాయంత్రం అతన్నిక్కడికి తీసుకొస్తాను. నీ అభిప్రాయం చెప్పు. నీ ఎస్సెస్‌మెంట్‌లో నా కెప్పుడూ నమ్మకముంది" అంది దివ్య.

దివ్య తండ్రి వెంకటరాజు నా సహోద్యోగి, మంచి మిత్రుడు కూడా. ఒకప్పుడు పక్కపక్కనే ఉండేవాళ్ళం. దివ్యకు మా ఇంట్లో చనువెక్కువ. తరువాత స్వంత ఇల్లు కట్టుకుని వేరే లొకాలిటీకి వెళ్ళినా నేనూ, మా ఆవిడా తరుచూ వాళ్ళింటికెళ్ళేవాళ్ళం; వాళ్ళూ మా ఇంటికి వస్తూండే వాళ్ళు. అందువల్ల ఆ పిల్ల నన్ను 'మామయ్య' అని పిలుస్తూ ఉండేది. మా అమ్మాయి ఈ పిల్ల కంటే పెద్దది. పెళ్ళి చేసి పంపేశాం. కొడుకు బాగా చిన్నవాడు. అందువల్ల, ఆ పిల్ల మాతోనే బాగా చనువుగా ఉండేది.

దివ్య మనస్తత్వం నాకు తెల్సు. అయినా అడగాలి కనుక అడిగాను, "మీ అమ్మా నాన్నలకు ఈ విషయం చెప్పావా, అతన్ని చూపించావా?" అని.

"చూపిస్తాను. ఇంకా చెప్పలేదు. ముందు నీ అభిప్రాయం చెప్పు", అంది, వెళ్ళిపోతూ.

ఓ మనిషిని చూశాక, మాట్లాడాక, అతన్ని సరిగా అంచనా వేయగలనన్న నమ్మకం నాకు లేదు. నిజానికి దివ్యకు కావలిసింది నా అభిప్రాయం కాదు. దివ్యకే కాదు, చాలమందికి ఇతర్ల అభిప్రాయం, సలహా అవసరం లేదు. అయితే అడక్కుండా ఉండరు. వాళ్ళకు కావల్సింది తమ అభిప్రాయాన్ని బలపర్చటం. మనుషుల ఉద్దేశాలెప్పుడూ సూటిగా ఉండవని నా నమ్మకం. వెంకటరాజుకు నేను మంచి స్నేహితుడిని కనుక, నా అభిప్రాయాలను అతడు గౌరవిస్తాడని ఆమె నమ్మకం కనుక, అవసర పడితే నేను తన అభిప్రాయాన్ని సమర్థిస్తానన్న ఆలోచనతో ఆమె నా దగ్గరికి వచ్చింది. ఎంత సాన్నిహిత్యమున్నా చెప్పతగినవీ, చెప్పకూడనివీ ఉంటాయి. కొన్ని విషయాల్లో– ముఖ్యంగా

కౌటుంబిక విషయాల్లో తల దూర్చటం నాకిష్ట ముండదు. అలాంటి విషయాల్లో దూరాన్నే పాటిస్తాను నేను.

చిన్నప్పటి నుండి ఆమెను గమనించిన నాకు ఆమె మనస్తత్వం తెలుసు. తనకు నచ్చిందాన్ని సొంతం చేసుకోకుండా ఉండదు ఆమె. అరిచి గోల పెట్టయినా తనకు కావల్సింది సాధిస్తుంది. ఓసారి మేమందరం కల్సి హైదరాబాదులోని 'ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్' కు వెళ్ళాం. అప్పుడు దివ్య చిన్నపిల్ల. ఓ షాపులో ఒక చక్కటి బొమ్మ చూసింది ఆమె. అది తనకు కావాలని మారాము చెయ్యసాగింది. వెంకటరాజు ఆ బొమ్మ ధర ఎంతో అడిగాడు. షాపతను యాభై రూపాయలని చెప్పాడు. ఆ రోజుల్లో అది పెద్ద మొత్తమే. పిల్లలాడుకునే బొమ్మ కోసం యాభై రూపాయలు వెచ్చించగలిగే స్తోమత అతనికి లేదు. తల్లీ దండ్రీ కూతురికి నచ్చచెప్ప ప్రయత్నించారు. కాని దివ్య మొండి పట్టు విడువలేదు. షాపు వదలి రానంటుంది.

"అదే వస్తుంది లే. మనం వెళ్దాం పదండి" అని ముందుకడుగేశాడు భార్యతో సహా వెంకటరాజు.

దివ్య అమాంతం నేలమీద పడి గిలగల కొట్టుకో సాగింది.

"ఏం గయ్యాళితనమే నీది, లే" అంటూ తల్లి వెనక్కు వచ్చి ఆమెని లేవదీయ ప్రయత్నించింది. దివ్య గిలగిలా కొట్టుకుంది గానీ లేవలేదు. తండ్రి వెళ్ళి రెండు తగిలించి ఆమెని ఈడ్చుకు వచ్చాడు. మేం ఎగ్జిబిషన్‌లో తిరిగినంతసేపూ ఆ బొమ్మ కావాలని గోల చేస్తూనే ఉంది. చివరకు ఆ గోల పడలేక, తన స్తోమతకు మించిన దయినా ఆబొమ్మను దివ్యకు కొనివ్వక తప్పలేదు వెంకటరాజుకు. అలాంటి పొజెసివ్ నేచరున్న దివ్య అరవిందును ప్రేమించిందంటే, అతనికింక ఊపిరి సలుపనివ్వదు. అతని కామెను ప్రేమించక తప్పదు. అతను ఆమె ఆస్తి అవక తప్పదు.

మర్నాడు సాయంత్రం దీపాలు పెట్టే వేళకు అరవింద్‌ను తీసుకు వచ్చింది దివ్య.

"మా మామయ్య" అంటూ నన్ను పరిచయం చేసింది. పిల్లవాడు ఒడ్డూ, పొడుగూ బాగానే ఉన్నాడు.

"ఏం చేస్తున్నావు, బాబూ?" అని అడిగాను.

"ఇన్ఫోటెక్‌లో పనిచేస్తున్నానండీ. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ని" అన్నాడతను.

ఈ కంప్యూటర్ గోలేమిటో నాకంతగా తెలియదు. ఈ పది, పదిహేనేళ్ళలో దాని ఉపయోగం విపరీతంగా పెరిగి పోయింది. నాబోటి పాతకాలం మనుషులు తప్ప,

సాధారణమయిన మనుషులు కూడా ఇంటర్నెట్‌లూ, ఇ-మెయిళ్ళూ ఉపయోగించటం మొదలెట్టారు. ఈ కంప్యూటరే నాకు పెద్ద విచిత్ర ప్రపంచం. అందువల్ల అతని ఉద్యోగ విషయాలు ప్రశ్నించటం మానేసి, అతని తల్లీదండ్రీ, కుటుంబం, పుట్టిన ఊరూ వగైరా విషయాలను గూర్చి ఆరా తీశాను.

అతన్ది తెనాలి. తండ్రి వేద పండితుడు. అధ్యాపన, అధ్యయనాల్లో కాలం గడిపేవాడు. అందువల్ల ఇల్లు గడవని పరిస్థితి వచ్చాక పౌరోహిత్యం చేపట్టినా జీవితంలో పెద్ద మార్పేం రాలేదు. తెనాలిలో ఓ పాతకొంప ఉన్నది. ఆయనకో కూతురు, ఓ కొడుకు. కష్టం మీద కూతురి పెళ్ళి చేశాడు. ఆయన పూర్వపుణ్యం వల్ల కొడుకు చదువు విషయంలో ఆయనేం కష్టపడలేదు. పిల్లవాడు స్వతహాగా తెలివి కలవాడు. గవర్నమెంటు స్కూలు, కాలేజీ, యూనివర్సిటీలలోనే చదివి, కంప్యూటర్ సైన్స్‌లో బి.ఇ. చేశాడు. ఉద్యోగమొచ్చింది. హైదరాబాదు వచ్చాడు. వారిది ఛాందస కుటుంబం. తన తండ్రి ఆలోచనలు ఈ కాలానికి సరిపోయేవి కావని అతనికి తెలుసు. ఆ ఆలోచనలతోనే బతికే మనిషి కాదతను. దివ్య నతనెంతో ప్రేమించాడు.

"మరి పెళ్ళికి మీ వాళ్ళు అనుమతిస్తారా?" అనడిగాను.

"మా నాన్న గుండెల్లో ఏముంటుందో ఎవరికీ అంతు పట్టదు. తన ఆలోచనలను ఇతరుల మీద రుద్దే మనస్తత్వం కాదు ఆయనది. తనకు కష్టం కలిగించిన వ్యక్తిని త్యజిస్తాడు ఆయన. అదే నాకు భయం. నా అంచనా తప్పు కూడా కావచ్చు. అమ్మ ఊర్కోదు. అరచి గోల పెడుతుందనుకుంటాను. ఒక్క మాటలో చెప్పాలంటే వాళ్ళు నిస్సహాయులు. అయినా తప్పదు."

"మరి చెప్పావా?"

"ఇంకా లేదు. దివ్య పేరెంట్సు అంగీకరిస్తే, మా పేరెంట్సుకూ చెబ్దామను కుంటున్నాను. వాళ్ళకు చెప్పకుండా చెయ్యనులేండి. ఐ డోంట్ బిలీవ్ ఇన్ కన్సీలింగ్ ఎనీథింగ్."

అతని ప్రవర్తన, మాటల ధోరణీ నాకు నచ్చాయి. కులం ఒక్కటి కాదన్న ఒక్క అంశం తప్ప, దివ్యకు వరుడవటానికి కావల్సిన మంచి అర్హతలన్నీ అతనికున్నాయి. నాకతడు నచ్చాడు. "మరి నువ్వు మీ అమ్మానాన్నలకు చెప్పావా, అమ్మాయీ!" అడిగాను దివ్యని.

"ఇంకా చెప్పలేదు, అంకుల్! వాళ్ళొప్పుకోరు. నువ్వు డాడీకి చెప్పరాదూ! డాడీ ఒప్పుకుంటే మమ్మీదేం లేదు."

"వాళ్ళొప్పుకోకపోతే?"

"ఎవరొప్పుకున్నా లేకున్నా అరవింద్‌ను పెళ్ళిచేసుకు తీర్తాను" అంది దివ్య నిశ్చయంగా.

"మంచిదే. అంత నిశ్చయం ఉంటే మీ పెళ్ళికాక తప్పదు."

నాకర్థమైంది దివ్య అరవింద్‌ని నాకు పరిచయం చెయ్యటంలోగల ఆంతర్యం. ఆమె తల్లిదండ్రులు వాళ్ళ వివాహానికి విముఖత చూపితే, వెంకటరాజుకు నేనో మాట చెప్పాలని ఆమె ఆశించింది.

నాలుగు రోజుల తరవాత దివ్య నాకు ఫోను చేసింది."అంకుల్, నువ్వు కూడా నన్నొదిలేస్తే ఎలా? డాడీకి చెప్తానన్నావు. చెప్పలేదు. మొన్న నేను మమ్మీడాడీలకు చెప్పాను, మా ప్రేమ విషయం. డాడీ ఇంతెత్తున ఎగిరాడు నామీద. తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేస్తున్నావని తిట్టాడు. తను బతికుండగా ఈ పెళ్ళి జరగదన్నాడు. ఇంటర్ కాస్ట్ మారేజని అభ్యంతరం" అంటూ తండ్రి తిట్లూ, దీవెనలూ విన్పించింది.

"మీ అమ్మేం అన్నది?"

"మమ్మీ డాడీకి వంత పాడింది. కీలకం అంతా డాడీలో ఉంది. డాడీ ఒప్పుకుంటే అంతా సెటిలయిపోతుంది. నువ్వుచెప్పు. నీ మాట డాడీ వింటాడు."

"సరే, చూద్దాం" అని ఫోను పెట్టేశాను.

కానీ, వెంకటరాజుతో దివ్య విషయం నేను ప్రస్తావించలేదు. సాధారణంగా అతనికేం సమస్య వచ్చినా, సలహా కావల్సివచ్చినా నన్ను సంప్రదిస్తుంటాడు. ఈ విషయం ప్రస్తావించలేదంటే అర్థం నాకీ విషయం తెలియటం అతనికిష్టం లేదన్న మాటే. వాళ్ళు రాజులు. వియ్యానికీ, కయ్యానికీ సమ ఉజ్జీ నెంచుకుంటారు. మధ్యలో ఈ శాకాహారపు జీవి తన అల్లుడవటం అతను సహించలేని విషయం.

ఆ మాట అతను బయటకు చెప్పడు. ఓ నెల రోజుల దాకా నాకే సమాచారం లేదు. ఓ రోజు వెంకటరాజు నా దగ్గరకు వచ్చాడు. మనిషి చాల దిగులుగా కన్పించాడు.

"దివ్య ఎవడ్నో ప్రేమించింది. అతడిది మన కులం కాదు. అతడిని తప్ప మరెవర్నీ పెళ్ళి చేసుకోనంటున్నది. నాకేంచెయ్యాలో పాలు పోవటం లేదు. రేపు ఆరో తారీకున రిజిష్టరు మారేజీట! అదిప్పుడు ఇంట్లో ఉండటం లేదు. ఎక్కడో వర్కింగ్ విమెన్స్ హాస్టల్‌లో ఉంటున్నది. ఈ వర్ణాంతర వివాహాల్లో నాకు నమ్మకం లేదు. ఇలాంటి పెళ్ళిళ్ళు రెండేళ్ళలో విఫలమవుతాయి" అన్నాడు.

"ఏదో కీడు జరుగుతుందని ముందే ఆలోచించటమెందుకూ? మంచే జరగొచ్చుగా? ఈ రోజుల్లో వర్ణాంతర వివాహాలని మనం బాధ పడాల్సిన పని లేదు. పిల్లవాణ్ణి నేను చూశాను. మంచివాడే. మంచి కుటుంబంలోనుంచి వచ్చిన వాడే. పది కాలాల పాటు పచ్చగా కాపురం చేసుకుంటారు. నువ్వు మనసు బాధ పెట్టుకోకు.."

ఎవడి కులం వాడికి గొప్ప. కుల నిర్మూలన సంఘాలు వెలిశాయి, ఉద్యమాలు తలెత్తాయి. ఫలితంగా కులకుడ్యం మరింత సుదృఢమయింది. సమాజం మరింతగా ముక్కలయింది. ఒకప్పుడు కులాలున్నా ఊళ్ళల్లో జనాలు 'పిన్ని, పెద్దమ్మ, అత్త, మామయ్య, బాబాయి, పెదనాయన' అని బంధుత్వాలు కలుపుకుని పిల్చుకునేవారు, ఇచ్చి పుచ్చుకునే వారు, సాయం చేసుకునేవారు. ఇతర్ల భావాలను గౌరవించేవారు. ఒకరి ఆచారాలు, కట్టుబాట్లు మరొకరికి కంటగింపయేవి కావు. కుల సంఘాల ఏర్పాటుతో మాత్సర్యాలు, ద్వేషాలు ఏర్పడ్డాయి. రాజకీయం ఈ విభాజిత సమాజం వల్ల లబ్ధిపొందుతోంది, విభజనకు తనవంతు సమిధ తనూ వేస్తున్నది. ఆహ్వానిస్తే నేనూ, మా ఆవిడా దివ్య, అరవింద్‌ల పెళ్ళికి వెళ్ళాము. వధూవరుల తల్లిదండ్రులెవరూ పెళ్ళికి రాలేదు. వాళ్ళ మిత్రబృందం మాత్రం వచ్చింది. పెళ్ళయింతర్వాత హోటల్లో పార్టీ ఇచ్చారు.

పెళ్ళయిన వారం రోజులకు దివ్య నాకు ఫోను చేసింది. "మా మమ్మీడాడీ మూర్ఖపుపట్టు పట్టుకు కూర్చున్నారుకానీ, అరవింద్ ఎంత మంచి వాడో వాళ్ళకు తెలియదు. 'నాకు సిగరెట్టు వాసన పడదు. నువ్వు మానెయ్యి' అన్నాను. వెంటనే మానేశాడు. నాకు రోజూ ఏడు గంటలకు ముందు నిద్ర లేవటం అలవాటు లేదు. అతను పొద్దున్నే లేస్తాడు. నాక్కూడా అతనే కాఫీ కలిపి తీసుకొచ్చి ఇస్తాడు. నేనే మాత్రం కష్ట పడ్డా అతను ఓర్చుకోలేడు. అంత మంచి అల్లుడు మావాళ్ళకు చేదయాడు" అంది.

"అదేం లేదులే, అమ్మా! కని పెంచిన మమకారం ఎక్కడికి పోతుంది! వాళ్ళకిష్టం లేకుండా పెళ్ళి చేసుకున్నావు. కనుక వాళ్ళకి బాధ కలిగింది, బిగుసుకు పోయారు. ఓ ఆర్నెల్లలో సర్దుకు పోతారు. కూతురితో పంతం పట్టుకు కూర్చుంటారా?" అని సముదాయించాను దివ్యని.

నేననుకున్నట్టుగానే అయింది. ఓరోజు వెంకటరాజు మార్కెట్‌లో కనబడి చెప్పాడు: "వర్ణాంతర వివాహమని మొండి పట్టు పట్టి కూర్చున్నాం కానీ, పిల్లవాడు మంచివాడు. దివ్యను బాగా చూసుకుంటున్నాడు. మొన్నామధ్య మా ఆవిడకు గాస్ట్రబుల్ వస్తే, అతనే అత్తగార్ని తీసుకెళ్ళి, ఎండోస్కోపీ అదీ చేయించి, డాక్టరు చెప్పిన మందులు కూడా

తెచ్చిచ్చాడు. 'ఎంత ఖర్చయిందో చెప్పవయ్యా, ఇస్తాను' అన్నా. వద్దంటే వద్దన్నాడు. 'మా అమ్మానాన్నలకు జబ్బు చేస్తే వాళ్ళను ఆసుపత్రికి తీసుకెళ్ళనా? అందుకు వాళ్ళ దగ్గర డబ్బు తీసుకుంటానా? మీరూ మా అమ్మనాన్నల లాంటి వాళ్ళే' అన్నాడు. సొంత కొడుకు కూడా అలా అనడనుకో" అని.

ఓసారి బంధువుల ఇంట్లో పెళ్ళి ఉంటే దిల్‌సుఖ్‌నగర్ వెళ్ళాను. పొద్దున ఎనిమిది గంటల ప్రాంతంలోనే పెళ్ళి ముహూర్తం. అక్కడికి దివ్యవాళ్ళ ఇల్లు దగ్గరే కనుక వాళ్ళ ఇంటికీ వెళ్ళి కొత్తకాపుర మెలా ఉందో చూసి వద్దామనుకున్నాను. కానీ అలాంటి అవసరం పడలేదు. దివ్యా, అరవింద్ కూడా పెళ్ళికి వచ్చారు. పెళ్ళికూతురు దివ్య క్లాసుమేటట.

"నువ్వు మా ఇంటికి రానేలేదు" అని నిష్ఠురమాడింది దివ్య.

"మీ ఆంటీకూడా రాలేదా ఇక్కడికి, ఇవాళ ఇట్నుంచి మీ ఇంటికే వద్దా మనుకున్నా నమ్మాయి! మీరే కలిశారు. మళ్ళీ ఎప్పుడయినా వస్తాలే" అని చెప్పాను.

"వచ్చేనెలలో మేం అమ్మవాళ్ళ ఇంటి దగ్గరకు మారిపోతున్నాం. మా వీధిలోనే కొత్తగా ఫ్లాట్లు కట్టారు. అక్కడో ఫ్లాటు ఖాళీగా ఉందని అమ్మ చెప్పింది. 'అక్కడాఇక్కడెందు కమ్మాయి! ఇంట్లో ఉండేది మీ అమ్మా, నేనూ. ఇక్కడే వచ్చి ఉండండి. మీకలా ఇష్టం లేకపోతే పైభాగ మెలాగో ఖాళీగా ఉంది. అందులో వుండండి' అన్నాడు నాన్న. అరవింద్‌కు ఇష్టం లేదు. నసుగుతున్నాడు. ఏ అవసరమొచ్చినా అమ్మానాన్నలు దగ్గరగా ఉంటారుగా. తనకు తెలీదు, చెప్తే వినడు" అంది దివ్య అరవింద్ పట్ల దొంగకోపం అభినయిస్తూ.

"దూరంగా వుంటే అభిమానాలు నిలుస్తాయని నా అభిప్రాయమండీ" అన్నాడు అరవింద్.

"ఆ, చెప్పకు. మీ పేరెంట్స్ ఇక్కడ ఉంటే ఆ మాట అంటావా? మనం విడిగా ఉంటే మా అమ్మానాన్నా మనసు కష్ట పెట్టుకుంటారు అనంటావు. నీ సంగతి నాకు తెలీదా?"

అయితే, అరవింద్ చెప్పిన అడ్డంకులేం నిలువలేదు. దివ్య మాట అతనికి వినక తప్పలేదు. వెంకటరాజు ఇంటి పై భాగంలోకి మారారు వాళ్ళు. అరవింద్- నిజానికి అతని పేరు అరవింద శర్మ- కుటుంబం మాత్రం ఈ వివాహం పట్ల రాజీ పడలేదు. వాళ్ళు కొడుకూ, కోడల్ని చూసుకోటానికి ఒక్కసారి కూడా హైదరాబాదు రాలేదు. అరవింద్ మాత్రం ఒకటి రెండు సార్లు తెనాలి వెళ్ళి వచ్చాడు.

రెండేళ్లు గడిచాయి. దివ్య గర్భవతి అయింది. ఆడపిల్లను కన్నది కానీ ఆ బిడ్డ బతకలేదు. మంచికి గానీ, చెడ్డకి గానీ ఆదుకోని అత్తమామలంటే దివ్యకు కినుక కలిగింది. ఓసారి దంపతులు నా ఎదుటే ఆ విషయంలో కొద్దిగా కీచులాడుకున్నారు.

ఆమె ఆసుపత్రిలో ఉన్నప్పుడు చూడటానికి వెళ్ళాను. "ఏం మనుషులో మా అత్తా మామా చూశారా, అంకుల్! నా సీమంతానికి రాలేదు, ఇప్పుడు పిల్ల పుట్టిపోయినా చూడటానికి రాలేదు. వాళ్ళ అర్థంలేని కోపం వల్లే నాబిడ్డ పోయింది" అంది.

"నోరు సంబాలించుకు మాట్లాడు. వాళ్ళకిష్టం లేని పని మనం చేశాం. కనుక వాళ్ళు మన నుండి దూరంగా ఉంటున్నారు. అంతేగానీ, వాళ్ళకిష్టం లేని పని మనం చేశామని శపించరు" అన్నాడు అరవింద్.

"మా వాళ్ళకూ ఇష్టం లేదు. వాళ్ళు సమాధాన పడలా? అగ్రవర్ణ దురహంకారం...."

అరవింద్‌కి అంత కోపం వస్తుందని నేనెప్పుడూ ఊహించలేదు. దివ్య వంక ఉరిమి చూశాడు. మరేం మాట్లాడకుండా ఆసుపత్రి బయటకు వెళ్ళిపోయాడు.

"ఇతనింతే అంకుల్ ! రీజనుకు నిలబడడు. తన వాళ్ళ మీద ఈగ వాలనివ్వడు. వాళ్ళు ఇతనికి గాలం వేస్తున్నారు. మొన్నెందుకో తెనాలి వెళ్ళి వచ్చాడు. అప్పటి నుండి ముభావంగా ఉంటున్నాడు. 'విషయ మేవిఁట'ని అడిగా. జవాబు చెప్పలేదు. డబ్బడిగి ఉంటారు. ఇచ్చివచ్చి ఉంటాడు. దోచి పెడుతున్నాడు లే" అంది.

"తప్పమ్మాయి! జరిగిందేదో తెలియకుండా మాట్టాడకు" అన్నాను.

ఆమె ఏదో చెప్పబోయింది. అంతలో మరెవరో ఆమెని పలకరించటానికి వస్తే ఆమెకు చెప్పి నేను బయటికి వచ్చేశాను. ఐదారు నెలలయింది.

ఓరోజు ఆదివారం పొద్దున్నే అకస్మాత్తుగా వెంకటరాజు నా దగ్గరికి వచ్చాడు.

"అరవింద్ అత్తాపూర్‌లో ఉంటున్నాడంట! ఓ సారి వెళ్ళి వద్దాం వస్తావా?" అన్నాడు.

"అదేమిటి? ఏమయింది? అక్కడుండటమెందుకు?" అనడిగాను, ఆశ్చర్యపోతూ.

"దివ్యా, అతనూ మాటామాటా అనుకున్నట్టున్నారు. మొన్నా మధ్య అతని వాళ్ళు వచ్చారు. ఏం పెటకం పెట్టారో మరి, వాళ్ళను తీసుకుని వెళ్ళి అత్తాపూర్‌లో కాపురం పెట్టాడు. ఆడపిల్లను చూసి సాధిద్దామనుకుంటున్నాడేమో, నా సంగతి తెలీదు. నరికి పారేస్తాను" అన్నాడు ఉద్రేకంగా.

నాలుగైదేళ్ళనుండి అతని దశ తిరిగింది. తన ఊరివాడు మినిష్టరయ్యాడు. అతను వెంకటరాజును పిఏ గా తీసుకున్నాడు. అప్పటి నుండి వెంకటరాజుకు డబ్బూ, పలుకుబడీ కూడా పెరిగాయి. ఇదివరకటిలా ఆచితూచి మాట్లాడటం మర్చిపోయాడు.

"నేనో మాట చెప్తా వింటావా?"

"చెప్పు."

"నువ్వు కోపంలో ఉన్నావు! కాపురం భగ్నం చేయటం క్షణంలో పని. నువ్వు అతనితో మాట్లాడావా? లేక నీ కూతురు చెప్పిన మాటలు పట్టుకుని ఇలా మాట్లాడుతున్నావా?"

మాది ఎప్పటి స్నేహమో. అందువల్ల తేలిగ్గా నా మాట తీసెయ్యలేక పోయాడు.

"నిజమే. నేనతనితో మాట్లాడలేదు. నిజానికి నేనతనితో మాట్లాడితే కోపంలో ఏం వాగుతానో అన్న భయం కూడా ఉంది. అతనెప్పుడూ నన్ను తుస్కారించి మాట్లాడలేదు. ఎప్పుడు మాట్లాడినా గౌరవానికి భంగం కలిగేటట్లు మాట్లాడలేదు."

"అతనితో మాట్లాడే పని నా కప్పచెప్పు. నువ్వు సాక్షీభూతంగా చూస్తూ ఉండేటట్లయితే నేను నీతో వస్తాను" అన్నాను.

వెంకటరాజు అంగీకరించాడు. మేం అత్తాపూర్ వెళ్ళేటప్పటికి పదకొండు గంటలయింది. అడ్రసు పట్టుకుని వెళ్ళాం.

ఇంటికి తాళం వేసి ఉంది. విచారిస్తే పక్కింటివాళ్ళు చెప్పారు, అతను ఆశ్రమానికి వెళ్ళాడని.. అతని తల్లి కేదోజబ్బు చేసిందనీ, ఆశ్రమంలో చికిత్స చేయిస్తున్నాడనీ. మేం ఆశ్రమానికి వెళ్ళాం.

అతనికోసం వెదుక్కోవాల్సిన అవసరం పడలేదు. గేటు దగ్గరే అరవింద్ తారస పడ్డాడు. "అయ్యో! మీరిలా...!" అని ఆశ్చర్య పడ్డాడు. మామగారి వంక చూసి పలకరింపుగా నవ్వాడు.

"మీ అమ్మగారికి ఆరోగ్యం బాగాలేదని విన్నాను. చూసి వెళ్దామని వచ్చాం" అన్నాను.

అతను మమ్మల్ని లోపలకు తీసుకెళ్ళాడు. పాతిక, ముప్ఫయి ఎకరాల్లో విస్తరించి ఉన్న ఆశ్రమం. దూరం దూరంగా పరుచుకుని ఉన్నాయి కుటీరాలు. స్వామి ఆనందతీర్థుడు జ్ఞాన బోధే కాదు, వైద్యం కూడా చేస్తాడు. మూలికా వైద్యం. పూర్వాశ్రమంలో ఆయనా, అరవింద్ తండ్రి గురునాథ శర్మ ఒకే గురువు దగ్గర చదువు కున్నారు. మిత్రుడి భార్య అనారోగ్యం గురించి విన్న తర్వాత ఆయనే వాళ్ళనిక్కడికి ఆహ్వానించాడు.

అరవింద్ క్లుప్తంగా ఈ విషయాలు మాకు వివరించాడు. "ఇంతకూ ఆమెకేమిటి జబ్బు?" అడిగాను.

"ఆమె కప్పుడప్పుడూ బుర్ర పోయినట్టు అన్పిస్తుంది. కళ్ళు కన్పించవు. ఏమీ గుర్తు పట్టలేదు. విపరీతమయిన తల నొప్పి. మళ్ళీ దానంతటదే సర్దుకుంటుంది. అలా తెరలు తెరలుగా వస్తూ వుంటుంది. ఈ మధ్య బాగా ఎక్కువైంది. ఇంగ్లీషు డాక్టరుకు చూపెడ్దామన్నా. మా నాన్నకు ఆ వైద్యంలో నమ్మకం లేదు. ఈయన దగ్గరకు తీసుకువచ్చాడు. ఈయనా భరవాసా ఇవ్వ లేదు."

"అది సరే, నువ్వు ఇల్లొదిలి వచ్చావేం? అమ్మాయి కంగారుపడుతోంది. అందుకే నేనూ, మీ మామగారూ కల్సి వచ్చాం."

"ఆఫీసుకు ఇక్కడి నుండి దగ్గర. అమ్మావాళ్ళకు సాయం చేసినట్టూ ఉంటుందని వచ్చాను. ఆమెకు చెప్పే వచ్చాను. కంగారు పడాల్సిన పనేంలేదు" అన్నాడతను.

అతని తల్లిని చూడటానికి వెళ్ళాం. ఆ కుటీరంలో రెండు చిన్న గదులున్నాయి. ముందు గదిలో ఆమె పడుకునిఉంది. రెండవ గదిలో అతని తండ్రి వంట చేస్తున్నాడు. మా అలికిడికి ముందు గదిలోకి వచ్చాడు. నవ్వినట్టు ఆయన ముఖం విప్పుకుంది. అరవింద్ చాప వేస్తే మేం కూర్చున్నాం. అతను తండ్రికి మమ్మల్ని పరిచయం చేశాడు.

"తెలుసు" అన్నాడాయన.

ఆ తరవాత వంట ఇంట్లోకి వెళ్ళిపోయాడు. ఇంక మాటలు ఇంకి పోయాయి. అరవింద్‌కూ మాటలు దొరకలేదు. నిద్ర పోతున్న అతని తల్లిని మేం లేపవద్దన్నాం.

"వెళ్ళి వస్తాం" అని అంటే, అరవింద్ తండ్రికి చెప్పాడు.

ఆయన బయటకు వచ్చాడు కానీ మమ్మల్ని ఉండమన లేదు. మమ్మల్నిసాగనంప బయటికీ రాలేదు.

తోవలో వెంకటరాజేం మాట్లాడలేదు. కారు దిగి ఇంట్లోకి వెళ్ళాం.

దివ్య మాకు ఎదురొచ్చింది. "అరవింద్ కన్పించాడా నాన్నా? ఏమంటాడు? విడాకులిస్తానన్నాడా?" అని అడిగింది.

వెంకటరాజు జవాబు చెప్పలేదు.

"అసలేం జరిగిందో చెప్పమ్మాయి!" అని నేనడిగాను.

"వాళ్ళు–అతని పేరెంట్స్ తక్కువ వాళ్ళుకాదు, అంకుల్! అప్పుడు నీతో చెప్పలా, తెనాలి వెళ్ళి వచ్చినప్పటినుండి ముభావంగా ఉంటున్నాడని. వాళ్ళమ్మకు జబ్బుగా ఉందంట!

ఆసుపత్రికి తీసుకెళ్దామంటే వాళ్ళనాయన అంగీకరించలేదంట! తన డబ్బు ఆయన తీసుకోడంట! ఆయన దగ్గర డబ్బులేదంట! ఇక్కడే ఎవరో స్వాములోరున్నారంట! వాళ్ళ అమ్మను అక్కడకు తీసుకెళ్తారంట! 'అప్పుడు వాళ్ళను ఇక్కడకు తీసుకు వస్తాను. మన్ని చూసి వెళ్తారు. నువ్వు మర్యాదలేం చెయ్యనక్కర లేదు. కాఫీలు గట్ర తాగమని నువ్వేం బలవంతం చెయ్యవద్దు. వాళ్ళిక్కడేం తీసుకోరు' అన్నాడు. చెప్పొద్దూ, నాకు కోపం నసాళాని కెక్కింది. 'నేనంత పనికిరాని దానినయితే వాళ్ళు నా ఇంటికే రావాల్సిన పని లేదు. నువ్వు నామాట కాదని తీసుకొచ్చావంటే వచ్చిన వాళ్ళమీద కళాపి జల్లుతాను' అని చెప్పాను. 'నువ్వు వాళ్ళని అర్థం చేసుకో. ఉన్నది కాదనలేరు, దాన్ని అంగీకరించనూ లేని పరిస్థితి వాళ్ళది. నేను కొడుకునే కదా! ఆయన మాట నేను వినలేదు. ఆయన పరిభాషలో వంశనాశనం పనిని నేను చేశాను. అందుకే ఆయన తన్ను నా నుండి ఉపసంహరించుకున్నాడు. నా నుండి ఆయనేమీ స్వీకరించడు. నా డబ్బక్కర్లేదు. నా సాయమక్కర్లేదు. ఇప్పుడు ఆయనకు కొత్తగా వచ్చిందీ లేదు, నేను దూరంగా వున్నందువల్ల నష్టమూ లేదు. దారిద్ర్యం ఆయన జీవిత సహచరి. ఆయన కే ప్రలోభం లేదు. అలా అని కఠినుడూ కాదు. ఆయన మన ఇంటికి వస్తాడో, రాడో నేను చెప్పలేను. వస్తే మాత్రం నువ్వు అమర్యాద చెయ్యకు' అన్నాడు. నాకయితే మండి పోయింది. ఏంవిటిట, ఆయన గొప్ప! 'నువ్వు వాళ్ళను మన ఇంటికి తీసుకొచ్చావా, నేను ఉరి వేసుకు ఛస్తాన'ని చెప్పాను. అంతే, ఓ రోజు కొంపలో నుండి మాయమయాడు. ఫోను చేస్తే ఎత్తడు. నేనే వాళ్ళ ఆఫీసు కెళ్ళి పట్టుకుంటే అతని ఆచూకీ తెలిసింది" అని చెప్పింది దివ్య.

"అతను నీకు విడాకులిస్తానని చెప్పాడా?" అని అడిగాను నేను.

"అతనేం చెప్పలేదు. మరి ఉన్నట్టుండి మనిషి మాయమయితే ఏమనుకోవాలి?"

"అమ్మాయి! నేనొక్క మాట చెప్తాను. వింటే నీకే మంచిది. మనిషి కొన్ని పరిసరాల్లో పుడతాడు. ఒక చోట పుట్టి పెరిగిన చెట్టును పెరికేసి ఇంకో చోట నాటాలని ప్రయత్నిస్తే అది చచ్చి ఊర్కొంటుంది. ఆ పుట్టిపెరిగిన వాతావరణం, పరిసరాలు, పరిచయాలు అన్నీ అతనెక్కడికి వెళ్ళినా వెంటనంటే ఉంటాయి. మీరిద్దరిప్పుడు పెళ్ళిచేసుకున్నారు కనుక మీరు పుట్టిపెరిగిన వాతావరణం, పరిసరాలు, పరిచయాలనుండీ ఒకర్నొకరు పెరికెయ్యాలనుకుంటే ప్రమాదం పొంచే వుంది. అరవింద్ ఆ పని చెయ్యలేదు. నువ్వు చేస్తున్నావు. అందుకే అతనా మాట అనకుండానే నువ్వు విడాకుల ప్రస్తావన తెస్తున్నావు. దానికి నీకు నిజంగానే తగిన సమర్థింపు ఉంది. అతనది కాదనలేదు. కానీ, నీ వాదన నంగీకరించలేదు. హేతువుకు దాటినదేదో వుంది. దాన్ని నిన్నర్థం చేసుకోమని

అర్థిస్తున్నాడతను. నువ్వది అర్థం చేసుకోవటం లేదు. అతన్నక్కడ నుండి పెరికేసి నీ పెరటిలో నాటాలనుకుంటున్నావు. అతని వాతావరణాన్ని గౌరవించటం నేర్చుకో. నువ్వే కాదు అతను పుట్టి పెరిగిన ప్రపంచం అతని కుంది. దాన్ని కాదను కున్న అతనికి జీవితేచ్ఛ ఉండదు. అది లేని మొగుడు నీకు నిరర్థకం. నీ అత్త మామలు నువ్వకునేటట్లు గర్హించ తగిన వ్యక్తులు కాదు. వాళ్ళకు కొడుకే రాజ్యం. ఆ రాజ్యాన్ని నువ్వు లాగేసుకున్నావు. వాళ్ళు నిస్సహాయులు. ఉన్న ఒక్క కొడుకూ వాళ్ళ మాట వినడు. నీ భర్తకు తల్లిదండ్రులను చూడాల్సిన బాధ్యత ఉందని కూడా నువ్వు గుర్తించటం లేదు. నీ ఆస్తిని వాళ్ళేదో లాగేసుకుంటారనుకుంటున్నావు. మొగుణ్ణి ఆస్తిగా కాదు, మనిషిగా చూడటం నేర్చుకో. అది మీ సంసారానికి మంచిది.”

అలా దివ్యకు నేనెప్పటి నుండో చెప్పాలనుకుంటున్న మాటలు చెప్పేసి బయట పడ్డాను. సత్యం ఏ మనిషి పిడికిలిలోనూ ఇమడదు. మనిషి ఏ అదుపునూ సహించలేడు. స్వేచ్ఛ ఆత్మ తత్త్వం.

ఆ తర్వాత చాల రోజులకు నాకు తెలిసింది. నేను వచ్చేసిన తర్వాత వెంకటరాజు కూతురికి చెప్పాడట.

“మామయ్య చెప్పింది నిజం. కన్న మమకారం నా కళ్లు మూసేసింది. అతను కాదంటున్నా మిమ్మల్ని తీసుకొచ్చి నా ఇంట్లో పెట్టుకున్నా. ఈ పాపంలో నాకూ భాగముంది. మీరు వీలయినంత త్వరలో నా ఇల్లు ఖాళీ చేసి వెళ్ళండమ్మా! ఆ తర్వాతమీరిద్దరూ కల్సి ఎప్పుడు నా ఇంటికొచ్చినా మీకు ఆహ్వానమే” అని.

స్వప్న *(మాస పత్రిక, డిసెంబరు 2009)*